క్రీడలతో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం

విజేతలతో ట్రెసా రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గౌతమ్‌కుమార్ తదితరులు

- ట్రెసా రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గౌతమ్‌కుమార్
- ఘనంగా ఉమ్మడి రంగారెడ్డిజిల్లా రెవెన్యూ స్పోర్ట్స్ మీట్

షాబాద్, ఫిబ్రవరి 4 : క్రీడలు శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని ట్రెసా రాష్ట్ర అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.గౌతమ్‌కుమార్ అన్నారు. ఆదివారం ఉమ్మడి రంగారెడ్డిజిల్లా రెవెన్యూ స్పోర్ట్స్ మీట్ ఇబ్రహీంపట్నం సమీపంలోని ఎస్ఎస్‌జీ క్రికెట్ మైదానంలో ఘనంగా జరిగాయి. రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, వికారాబాద్ జిల్లాల నుంచి రెవెన్యూ ఉద్యోగులు పెద్దఎత్తున వివిధ క్రీడల్లో పాల్గొని తమ ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ముఖ్యంగా క్రికెట్, బాడ్మింటన్, టెన్నికాయిట్, చెస్, క్యారమ్స్, ఖోఖో, మ్యూజికల్ చైర్ తదితర ఆటల్లో క్రీడాస్ఫూర్తిని నెలకొల్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రెవెన్యూ ఉద్యోగులు పని ఒత్తిడి నుంచి ఉపశమనం పొందడానికి క్రీడలు ఎంతో దోహదపడుతాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ శారీరకంగా దృఢంగా ఉండాలని సూచించారు. ప్రధాన కార్యదర్శి గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ..ఒత్తిడిని చిత్తు చేయడానికి వివిధ రకాల ఆటలు దిన చర్యలో భాగం కావాలని కోరారు. ఈ సందర్భంగా క్రికెట్‌లో విజేతగా నిలిచిన రంగారెడ్డి జట్టును అభినందించి జట్టు కెప్టెన్ రామకృష్ణ, బృందానికి ట్రోఫీని అందజేశారు. రన్నరప్ ట్రోఫీని మేడ్చల్ టీమ్ కెప్టెన్ సంతోష్, బృందానికి అందజేశారు. వికారాబాద్ జిల్లా టీమ్ పోరాట స్ఫూర్తికి కెప్టెన్ విజయేందర్, బృందాన్ని అభినందించారు. వివిధ ఆటల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో ట్రెసా ఉపాధ్యక్షులు రాంరెడ్డి, నిరంజన్, అన్వర్, జాయింట్ సెక్రటరీ వాణిరెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్, వికారాబాద్ జిల్లా సెక్రటరీ విజయేందర్, రంగారెడ్డిజిల్లా స్పోర్ట్స్ సెక్రటరీ రామకృష్ణ, ట్రెసా సభ్యులు ప్రసన్నలక్ష్మి, నాగజ్యోతి, కిరణ్, రాజేశ్వర్‌రెడ్డి, తారక్, సాగర్, సాయికిరణ్ పాల్గొన్నారు. ఇంత మంచి కార్యక్రమాన్ని ఆర్గనైజ్ చేసిన నిర్వాహకులు సుధాకర్, వాణి, రామకృష్ణ బృందాన్ని ట్రెసా సభ్యులు అభినందించారు.

బల్దియా.. మొద్దునిద్ర

- ఆదాయానికి గండిపడుతున్నా.. పట్టింపేది..?
- లక్ష్య సాధనలో అలసత్వం
- ఇప్పటికే ఆస్తిపన్ను వసూళ్లలో వెనుకంజ
- ట్రేడ్ లైసెన్స్‌లోనూ అదే తీరు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): బల్దియా ఆర్థిక పరిస్థితి రోజురోజుకు బక్కచిక్కుతున్నా.. అధికారులు మాత్రం మొద్దు నిద్ర వీడటం లేదు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముంచుకొస్తున్నా.. వచ్చే నెలలో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో ఆస్తిపన్ను నిర్దేశిత లక్ష్యం రూ.2100కోట్లలో ఇప్పటి వరకు రూ.1333 కోట్లు మాత్రమే వసూలయ్యాయి. అలాగే ట్రేడ్ లైసెన్స్‌ల జారీ, రెన్యువల్‌లోనూ అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. గతేడాది ఇదే సమయానికి లక్ష ఆరు వేల మంది వ్యాపారస్తులు ట్రేడ్ లైసెన్స్‌లు రెన్యువల్ చేస్తే..ఈ సారి మాత్రం కేవలం 34వేల మాత్రమే రెన్యువల్ కావడం అధికారుల పనితీరుకు అద్దం పడుతున్నది. క్షేత్రస్థాయిలో కొందరు ఏఎంహెచ్‌వోలు, డీసీలు వ్యాపారస్తులతో కుమ్మక్కై సంస్థకు కన్నం పెడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. జోనల్ కమిషనర్లు, కమిషనర్ పర్యవేక్షణ లోపం కారణంగా ఆస్తిపన్ను, ట్రేడ్ లైసెన్స్‌ల జారీలో ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవంగా జవనరి నుంచి డిసెంబర్ వరకు ట్రేడ్ లైసెన్స్‌ల గడువు ఉంటుంది. జవనరిలో రెన్యువల్స్ ఉంటాయి. కొందరు వ్యాపారస్తులు ముందే రెన్యువల్ చేసుకుంటారు. అయితే ట్రేడ్ లైసెన్స్‌ల రెన్యువల్‌లో జాప్యం చేస్తే లైసెన్స్ ఫీజుకు అదనంగా ఫిబ్రవరి 1 నుంచి మార్చి 31 వరకు మధ్యలో రెన్యువల్ చేస్తే 25 శాతం అపరాధ రుసుం, ఏప్రిల్ 1 తర్వాత లైసెన్స్‌లను పునరుద్ధరిస్తే రెన్యువల్ దరఖాస్తులపై అదనంగా 50 శాతం అపరాధ రుసుముగా వసూలు చేస్తారు. ట్రేడ్ లైసెన్స్ పొందకుండా వ్యాపారాలు నిర్వహిస్తే 100 శాతం పెనాల్టీ విధించడంతో పాటు నెలకు 10శాతం అదనపు జరిమానా విధిస్తారు.

అదనపు అంతస్తులు ఉంటే..

ఆస్తిపన్ను వసూళ్లలో అక్రమాలను పరిశీలిస్తే... ఆస్తిపన్ను ఏరియా తక్కువ చూపించడం..కమర్షియల్ నుంచి రెసిడెన్షియల్ చూపించడం, వేయాల్సిన ట్యాక్స్ ఒక్కసారి వేసి భయభ్రాంతులకు గురిచేసి ఆ తర్వాత సంబంధిత భవన యజమానితో ఒప్పందాలు కుదుర్చుకోవడం...అదనపు అంతస్తులు ఉంటే చూసీచూడనట్లు ఉండడం...నిర్మాణంలో ఒక్క దుకాణం ఉన్న.. రెసిడెన్షియల్‌గానే చూపించడం వంటివి అక్రమాలు జరుగుతున్నాయన్నది అక్షరసత్యం. ఇక ట్రేడ్ లైసెన్స్ పాత ట్రేడ్ ఇండెక్స్ నంబరు..ఈజీగా ఇవ్వరు..ప్రొవిజన్ విధానంలో కొనసాగిస్తూ వ్యాపారస్తులతో క్షేత్రస్థాయిలో కొందరు అధికారులు అందినంత దండుకుంటున్నారు. దీని ఫలితంగానే ఆస్తిపన్ను, ట్రేడ్ లైసెన్స్‌ల నుంచి రావాల్సిన ఆదాయం సంస్థకు రావడం లేదని, కమిషనర్ ఈ దిశగా దృష్టి సారించాలని కోరుతున్నారు.

ముందుకు సాగని ఆస్తిపన్ను వసూళ్లు

ఆస్తిపన్ను చెల్లింపుల్లో ఈ ఏడాది నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమించడం కష్టమేనని అధికార వర్గాల్లో చర్చ జరుగుతున్నది. కమిషనర్ ఆదేశించినా.. క్షేత్రస్థాయిలో మాత్రం ఆస్తిపన్ను వసూళ్ల ఆశించిన స్థాయిలో రావడం లేదు. గత నెల 31వ తేదీ మాత్రం ఒక్కరోజు రికార్డు స్థాయిలో రూ. 28కోట్ల మేర ఆదాయం వచ్చింది. ఈ నేపథ్యంలోనే రూ.2100కోట్ల టార్గెట్‌లో ఇప్పటి వరకు రూ. 1333 కోట్లు మాత్రమే ఆస్తిపన్నును రాబట్టారు. ఈ సమయంలోనే పార్లమెంట్ ఎన్నికల కోడ్ ఈ నెలలోనే వచ్చే అవకాశాలున్నాయన్న తరుణంలో ఆస్తిపన్ను లక్ష్యంపై అనుమానాలు నెలకొన్నాయి.

ట్రేడ్ లైసెన్స్ పునరుద్ధరణకు అవకాశం

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ట్రేడ్ లైసెన్స్ పునరుద్ధరణకు అవకాశం కల్పించినట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ ఒక ప్రకటనలో తెలిపారు. రెన్యువల్ గడువును జనవరి 31వరకు తొలుత విధించామని, తాజాగా 25 శాతం పెనాల్టీతో మార్చి 31 వరకు రెన్యువల్ చేసుకునే అవకాశం ఉందని, ఏప్రిల్ 1 తర్వాత చేసుకోవాలంటే 50 శాతం మేర జరిమానా చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు. ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తే భారీ జరిమానాలు ఉంటాయని, నిర్ణీత గడువులోగా ప్రొవిజనల్ పత్రాలను పునరుద్ధించుకోవాలని స్పష్టం చేశారు.

జోన్ల వారీగా టార్గెట్, వసూళ్లు

జోన్	నిర్దేశిత టార్గెట్	వసూలైనవి (రూ.కోట్లలో)
ఎల్బీనగర్	320.94	189.02
చార్మినార్	150.91	93.78
ఖైరతాబాద్	546.07	333.29
శేరిలింగంపల్లి	447.28	308.61
కూకట్‌పల్లి	346.95	228.72
సికింద్రాబాద్	287.85	181.02

ప్రతి ఏటా ట్రేడ్ లైసెన్స్‌ల రెన్యువల్ ఇలా..

సంవత్సరం	ట్రేడర్స్	కలెక్షన్ (రూ.కోట్లలో)
2021-22 (మార్చి- డిసెంబర్)	34813	62.41
2022 (జనవరి-డిసెంబర్)	74561	70.26
2023 (జనవరి -డిసెంబర్)	106333	81.92
2024 (జనవరి 1నుంచి 30వరకు)	34298	51.20

ప్రతి ఏటా కొత్తగా ట్రేడ్ లైసెన్స్‌లు జారీ చేసినవి

సంవత్సరం	న్యూ ట్రేడర్స్	కలెక్షన్ (రూ.కోట్లలో)
2022	43888	26.73
2023	54744	27.89
2024 (జనవరి 1నుంచి 30వరకు)	4646	2.60

డ్రైవింగ్‌లో.. మేము సైతం..

- డ్రైవింగ్‌పై యువతులు, గృహిణులు అధిక ఆసక్తి
- గత ఏడాది 42,557 లైసెన్స్‌లు జారీ
- ఈ ఏడాది ఇప్పటి వరకు 1765 యువతులకు లైసెన్స్‌లు
- రాష్ట్రంలో లైసెన్స్ జారీలో గ్రేటర్ వాటే అధికం

డ్రైవింగ్ నేర్చుకొంటున్న మహిళ

సిటీబ్యూరో, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ) : స్టీరింగ్ తిప్పుతూ..గేరు మార్చుతూ మహిళలు రోడ్లపై వాహనాలను పరుగెత్తిస్తున్నారు. నగరంలో స్కూటీ, కారు డ్రైవింగ్ నేర్చుకోవడంపై యువతులు అమితాసక్తి ప్రదర్శిస్తున్నారు. శిక్షణ తీసుకొని డ్రైవింగ్ టెస్ట్‌లకు హాజరవుతూ లైసెన్స్ పొందుతున్నారు. నగర బిజీ జీవితంలో ఇప్పుడు వాహనం నడపడం అనివార్యంగా మారింది. కార్యాలయాలకు వెళ్లడం.. పిల్లలను స్కూల్ వద్ద డ్రాప్ చేయడం.. తిరిగి ఇంటికి తీసుకురావడం.. పండుగలకు ఊరెళ్లడం.. ఇలా మహిళలకు డ్రైవింగ్ తప్పనిసరిగా మారింది. గతంలో సిటీలోని మొత్తం డ్రైవింగ్ లైసెన్సులలో ఒకటి, రెండు శాతంలోనే ఉండేది మహిళల సంఖ్య. కానీ, ఇప్పుడు 50 శాతం వరకు లైసెన్స్‌లో వారీ వాటా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. గత ఏడాది 42,557 మంది మహిళలు లైసెన్స్ పొందగా ఈ ఏడాది ప్రస్తుతం వరకు 1765 మంది లైసెన్స్ పొందారు.

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇలా...

2019	- 30555
2020	- 20851
2021	- 29,898
2022	- 31,902
2023	- 42,557
2024 ప్రస్తుతం	- 1765
మొత్తం	1,57,528

కారుకే జై..!!

గ్రేటర్‌లో సుమారు 400లకు పైగా డ్రైవింగ్ స్కూళ్లు ఉన్నాయి. వీటితోపాటు మరో 50 నుంచి 60 వరకు మారుతి, టయోటా లాంటి కంపెనీ డ్రైవింగ్ స్కూళ్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో ఒక్కో బ్యాచ్‌కు కనీసం 20నుంచి 35 మంది చొప్పున కారు డ్రైవింగ్ నేర్చుకుంటున్నారని నిర్వాహకులు చెబుతున్నారు. గ్రేటర్ పరిధిలో 2019 నుంచి ఇప్పటి వరకు 1.57 లక్షల మంది మహిళలు డ్రైవింగ్ లైసెన్స్ పొందారు. ఇందులో అధిక భాగం ఫోర్ వీలర్ లైసెన్స్ ఉన్నవాళ్లే. గ్రేటర్‌లో మొత్తం 4.27 లక్షలకు పైనే డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న మహిళలు ఉన్నారని ఆర్టీఏ లెక్కలు చెబుతున్నాయి.

సరైన శిక్షణ తీసుకోవాలి..

డ్రైవింగ్ నేర్చుకోవడానికి మహిళలు చాలా ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. ఇది చాలా మంచి పరిణామం. అందులోనూ ఫోర్ వీలర్ లైసెన్స్ పొందే వారి సంఖ్య అధికం. నాణ్యత ప్రమాణాలను పాటిస్తున్న డ్రైవింగ్ స్కూళ్లలోనే శిక్షణ తీసుకోవాలి. రోడ్డు నిబంధనలన్నీ క్షుణ్ణంగా గుర్తించుకోవాలి. రోడ్డు ప్రమాదాలకు తావులేకుండా డ్రైవింగ్ నేర్చుకోవాలి. ఆలస్యమైనా పర్లేదు కానీ వచ్చిరానీ డ్రైవింగ్‌తో లైసెన్స్ పొందాలని ప్రయత్నిస్తే కుదరదు. ఆర్టీఏ నిర్వహించే అన్ని టెస్టుల్లో ఉత్తీర్ణత సాధించాలి.

- రవీందర్ గౌడ్, ఆర్టీఓ, ఉప్పల్

పన్ను చెల్లించకపోతే వాహనాలు సీజ్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ) : వాహన పన్ను చెల్లించకుండా తిరుగుతున్న రవాణా వాహనాలపై ఆర్టీఏ అధికారులు దృష్టి సారించారు. నాలుగు రోజుల నుంచి ప్రత్యేక తనిఖీలు చేస్తున్నారు. అందులో భాగంగా ఇప్పటి వరకు 220 వాహనాలు పన్ను చెల్లించకుండా తిరుగుతున్నట్లు గుర్తించి కేసులు నమోదు చేశారు. ఇప్పటి వరకు 15 లక్షల పన్ను వివిధ రకాల వాహనాల నుంచి వసూలైంది. పన్ను చెల్లించకుండా నిబంధనలు విరుద్ధంగా నడుస్తున్న వాహనాలను అధికారులు సీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జేటీసీ రమేష్ మాట్లాడుతూ.. నగరంలో ప్రత్యేక తనిఖీలు చేపట్టామని అన్నారు. వాహనానికి సంబంధించి ఆర్టీఏ నిబంధనలన్నీ పాటించాల్సిన బాధ్యత వాహనదారులదేనని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ వాహనాలపై ఉన్న పన్ను స్వచ్ఛందంగా చెల్లించాలని కోరారు.

మెట్రో లింకులు కలిపేదెట్లా..?

- పీపీపీ విధానంలో మొదటి.. రెండో దశ చేపట్టేదెట్లా..?
- 5 చోట్ల మొదటి దశతో లింకులు..
- డీపీఆర్ రూపకల్పనలో అధికారులకు సంక్లిష్ట సవాళ్లు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ) : మెట్రో రెండోదశ పనులు క్షేత్ర స్థాయిలో ముమ్మరంగా కొనసాగుతున్నాయి. రెండో దశకు సంబంధించిన 7 ప్రధాన కారిడార్లలో ట్రాఫిక్ సర్వేతో పాటు నిర్మాణానికి సంబంధించిన అంశాలపై మెట్రో అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రెండో దశకు సంబంధించిన డీపీఆర్‌ను 3 నెలల్లో సిద్ధం చేయాలని సూచించడంతో అదే పనిలో మెట్రో యంత్రాంగం నిమగ్నమైంది. అయితే రెండో దశలో ప్రతిపాదించిన కారిడార్లన్నీ ఇప్పటికే నిర్మించిన మొదటి దశ మెట్రోతో అనుసంధానం చేస్తూ ప్రాథమికంగా ప్రతిపాదనలు రూపొందించారు. ఇందుకు అనుగుణంగానే మొత్తం 7 కారిడార్లలో 70 కి.మీల దూరంతో రెండో దశ నిర్మాణం కోసం డీపీఆర్‌ను సిద్ధం చేసే పనిలో మెట్రో అధికారులు ఉన్నారు. అయితే ఇక్కడే మెట్రో అధికారులకు సవాళ్లు ఎదురవుతున్నాయి. మొదటి దశ మెట్రో పూర్తిగా ప్రభుత్వ పైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో నిర్మించగా, రెండో దశను ఏ విధానంలో నిర్మించాలన్న దానిపై స్పష్టత లేదు. కేవలం డీపీఆర్ రూపకల్పనకు రాష్ట్ర ప్రభుత్వం మెట్రో సంస్థకు బాధ్యతలు అప్పగించినా, అసలు కథంతా రెండు దశలను కలిపి నిర్మించడం, ఆ తర్వాత వాటి నిర్వహణ మీదే సంక్లిష్టమైన పరిస్థితులు నెలకొన్నాయి. అసలే రద్దీగా ఉండే రోడ్లపై మెట్రో ప్రాజెక్టు నిర్మాణమే ఒక విధమైన సవాలు అయితే, అంతకు ముందు దాని డిజైన్ రూపకల్పన మరింత సంక్లిష్టంగా కనిపిస్తోంది.

7 మార్గాలు..70 కిలోమీటర్లు..

ప్రస్తుతం వినియోగంలో ఉన్న మెట్రో మొదటి దశలో 5 చోట్ల లింకులు కలుపుతూ.. 7 మార్గాలను 70 కి.మీ మేర నిర్మించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇక్కడే అసలు సవాలు మెట్రో అధికారులకు ఎదురవుతున్నది. మొదటి దశను నిర్వహిస్తున్న ఎల్ అండ్ టీ మెట్రోతో కలిసి పనిచేసేలా నిర్మాణం చేపట్టాలా? లేక అక్కడి నుంచి వేర్వేరుగా కారిడార్లను నిర్మించాలా? అన్న దానిపై మల్లగుల్లాలు పడుతున్నారు. ప్రధానంగా మొదటి దశను పీపీపీ విధానంలో నిర్మించిన ఎల్ అండ్ టీ దాని నిర్వహణను సుమారు 30 ఏండ్ల పాటు నిర్వహిస్తుండగా, కొత్తగా నిర్మించే మార్గాలను దానికి అప్పగించడానికి ఎన్నో అడ్డంకులు ఉన్నాయి. వీటిలో ప్రధానంగా మెట్రో వయాడక్ట్ నిర్మాణాన్ని కలిపి నిర్మించాలా? లేక అక్కడి సమీపం నుంచి నిర్మించాలా? అన్నది ఒక టైతే, ప్రాజెక్టు నిర్మాణం పూర్తయిన తర్వాత మెట్రో రైళ్లను నిర్వహించే బాధ్యతలు ఎలా చేపట్టాలి? అందుకు ఎల్ అండ్ టీ వాడిన సిగ్నలింగ్ టెక్నాలజీని వినియోగించాలా? లేదా అంతకన్నా మెరుగైన టెక్నాలజీని వాడాలా అన్న అంశాలను పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఇలా పలు అంశాలను మెట్రో అధికారులు పరిశీలిస్తున్నారు. ప్రధానంగా కారిడార్-1(మియాపూర్-ఎల్‌బీనగర్) మార్గంలో ఒకవైపు ఎల్‌బీ నగర్ మెట్రో స్టేషన్ నుంచి వనస్థలిపురం, హయత్‌నగర్ వరకు (8 కిలోమీటర్లు), మరో వైపు మియాపూర్ మెట్రో స్టేషన్ నుంచి బీహెచ్ఈఎల్ మీదుగా పటాన్ చెరు వరకు (14 కిలోమీటర్లు) ప్రతిపాదించిన రూట్లను నిర్వహించాలంటే మొదటి దశ చాలా కీలకంగా ఉంటుంది.

మెట్రో డిపోలు నిర్మించాల్సిందే..

మొదటి దశకు సంబంధం లేకుండా మెట్రో కారిడార్‌లను నిర్మించాలంటే మెట్రో డిపోలను ఎక్కువ చోట్ల నిర్మించాల్సి ఉంటుంది. ఇందు కోసం పెద్ద మొత్తంలో భూములు అవసరం, నిర్మాణం కోసం అధికంగా వ్యయమవుతుంది. దీనికి బదులుగా కారిడార్-1కు ఇరువైపులా కొత్తగా ఒకవైపు 8, మరో వైపు 14 కి.మీ అనుసంధానం చేస్తే ఎల్ అండ్ టీ మెట్రోనే దాని నిర్వహణకు అంగీకరిస్తే కొత్తగా మెట్రో డిపోలను నిర్మించాల్సిన అవసరం ఉండదు. అదే విధంగా ఈ మార్గంలో ఎల్ అండ్ టీ మెట్రో వాడిన సిగ్నలింగ్ టెక్నాలజీ, ఇతర సాంకేతిక అంశాలను దానికి అనుగుణంగానే నిర్మాణం చేపడితే సరిపోతుంది. అదేవిధంగా కారిడార్-2(జేబీఎస్ నుంచి ఫలక్‌నుమా)లో ఇప్పటి వరకు ఎంజీబీఎస్ వరకు పూర్తి కాగా, రెండోదశ ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా, అక్కడి నుంచి మరో 1.5 కి.మీ పొడిగిస్తూ చాంద్రాయణగుట్ట వరకు పొడిగించిన మార్గాన్ని ఎల్ అండ్ టీ మెట్రో అప్పగించేందుకు అనుకూలంగా ఉంటుందని ప్రాథమిక అధ్యయనంలో గుర్తించారు.

కారిడార్-3లోనూ ఇదే పరిస్థితి..

ఇక మొదటి దశ మెట్రో కారిడార్-3 (నాగోల్-రాయదుర్గం)లో ఒకవైపు రాయదుర్గం నుంచి ఫైనాన్సియల్ డిస్ట్రిక్ వరకు 8 కి.మీ, మరోవైపు నాగోల్ నుంచి ఎల్‌బీనగర్, అక్కడి కారిడార్-1కు అనుసంధానం చేయాలా? వద్దా? అన్న అంశాలను పరిగణలోకి తీసుకొని డీపీఆర్‌ను రూపొందించాల్సి ఉంటుంది. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం నాగోల్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు ప్రతిపాదించిన మెట్రో మార్గాన్ని ఎక్కడి నుంచి ప్రారంభించాలి. ప్రారంభ మెట్రో స్టేషన్ ఎలా ఉండాలి? అన్న విషయాలను కీలకంగా పరిశీలించాల్సి ఉన్నదని ఓ మెట్రో అధికారి తెలిపారు. అంతిమంగా ప్రయాణికులకు నాన్ స్టాప్ (ఒక చివర నుంచి మరో చివరకు) మెట్రో ప్రయాణం చేయాలంటే లింకుల్లేని మెట్రో కారిడార్‌లను అందుబాటులోకి తీసుకోవాల్సిన అవసరం ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఆర్థిక భారం తగ్గాలన్నా, భవిష్యత్తులో నిర్వహణ, మరమ్మతుల ఖర్చులు తక్కువగా ఉండాలన్నా మొదటి దశ మెట్రోను నిర్వహిస్తున్న ఎల్ అండ్ టీ మెట్రోతో కలిసి ప్రాజెక్టులను నిర్వహించేందుకు వీలుగా డిజైన్ చేయాల్సిన అవసరం ఉందని అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. డీపీఆర్ రూపొందించే నాటికి అన్ని సవాళ్లను సమగ్రంగా చర్చించి, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లిన తర్వాతే మెట్రో రెండో దశ డీపీఆర్‌ను సిద్ధం చేసే అవకాశమున్నదని మెట్రో అధికారులు అభిప్రాయపడుతున్నారు.

రెండో దశలో చేపట్టే మెట్రో కారిడార్లు(కొత్త రూట్ మ్యాప్)

- కారిడార్ 2: ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్ నుంచి ఫలక్‌నుమా వరకు (5.5 కిలోమీటర్లు)
- కారిడార్ 2: ఫలక్ నుమా నుంచి చాంద్రాయణగుట్ట క్రాస్ రోడ్డు వరకు (1.5 కిలోమీటర్లు)
- కారిడార్ 4: నాగోల్ మెట్రో స్టేషన్ నుంచి ఎల్ బీ నగర్ మెట్రో స్టేషన్ వరకు, అక్కడి నుంచి చాంద్రాయణ గుట్ట క్రాస్ రోడ్డు, మైలార్‌దేవ్‌పల్లి, పీ7 రోడ్డు నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వరకు (మొత్తం 29 కిలోమీటర్లు)
- కారిడార్ 4: మైలార్‌దేవ్‌పల్లి నుంచి ఆరాంఘర్ మీదుగా రాజేంద్రనగర్‌లో ప్రతిపాదించిన హైకోర్టు ప్రాంగణం వరకు (4 కిలోమీటర్లు)
- కారిడార్ 5: రాయదుర్గ్ మెట్రో స్టేషన్ నుంచి బయో డైవర్సిటీ జంక్షన్, నానక్ రామ్ గూడ జంక్షన్, విప్రో జంక్షన్, అమెరికన్ కాన్సులేట్ (ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్) వరకు (8 కిలోమీటర్లు)
- కారిడార్ 6: మియాపూర్ మెట్రో స్టేషన్ నుంచి బీహెచ్ఈఎల్ మీదుగా పటాన్ చెరు వరకు (14 కిలోమీటర్లు)
- కారిడార్ 7: ఎల్‌బీనగర్ మెట్రో స్టేషన్ నుంచి వనస్థలిపురం, హయత్ నగర్ వరకు (8 కిలోమీటర్లు)

నేడు కమిషనర్ ఫోన్ ఇన్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): ప్రజాసమస్యలను నేరుగా అడిగి తెలుసుకుని వాటికి పరిష్కారం చూపేందుకు ప్రతి సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్, సర్కిల్ కార్యాలయాల్లో 'ప్రజావాణి' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే నేడు ప్రజావాణితో పాటు జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్‌తో 'ఫోన్ ఇన్' కార్యక్రమం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. సోమవారం ఉదయం 10.30 నుంచి 11.30 వరకు ఈ కార్యక్రమం ఉంటుందని, సమస్యలు చెప్పుకోవాలనుకునే వారు 040-23222182కు ఫోన్ చేయాలని సూచించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావాణిలో అర్జీలు స్వీకరించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

ఉద్యమకారుల కోసం

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ చీమ శ్రీనివాస్

చేవెళ్లటౌన్, ఫిబ్రవరి 4 : తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడిన ఉద్యమకారుల కోసం ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ చీమ శ్రీనివాస్ తెలిపారు. ఫోరం చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాములు అధ్యక్షతన ఆదివారం చేవెళ్లలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞత సభ ఏర్పాటు చేశారు. ఈ సభకు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఉద్యమకారులందరినీ తలెత్తుకొని చూసేలా చూడాలని, ఎఫ్ఐఆర్‌తో సంబంధం లేకుండా 250 గజాల ఇంటి స్థలాన్ని కేటాయించాలని కోరారు. ఉద్యమకారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. అర్హులైన ఉద్యమకారులకు సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

తెలంగాణ ఉద్యమకారుల సభ అట్టర్ ఫ్లాప్

తెలంగాణ ఉద్యమకారుల తరపున చేవెళ్లలో నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞత సభ ఫెయిల్ అయింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణాలు కోల్పోయిన ఉద్యమకారుడు యాదిరెడ్డిని మర్చిపోవడంతోపాటు సభపై ఏర్పాటు చేసిన బ్యానర్‌లో అమరవీరుడు యాదిరెడ్డి ఫొటో లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఉద్యమకారులకు సమాచారం ఇవ్వలేదని, ఈ ప్రోగ్రాం ఉద్యమకారులదా లేక కాంగ్రెస్ పార్టీదా అని పాల్గొన్న ఉద్యమకారులు ఆరోపించారు. జ్యోతి ప్రజ్వలన చేయకుండా సన్మానాలు.. సభా సంప్రదాయాలను పక్కన పెట్టడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు జ్యోతిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు యాదిరెడ్డి, చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీమ్‌భరత్ ఉన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేయకుండా ఉద్యమకారులకు సన్మానాలు

కొత్తూరు : తుర్కయాంజాల్‌లోని లార్డ్స్ గ్రూప్ స్కూల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సైన్స్ ట్యాలెంట్ టెస్ట్‌లో కొత్తూరు జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు అభిషేక్ తివారీ, ఆర్యన్‌రాజ్, ఆకాశ్ ఎంపికయ్యారు. వీరిని జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు అంగూర్, సైన్స్ ఉపాధ్యాయుడు భానుప్రకాశ్ అభినందించారు. స్టేట్ ఫైనల్ సెలక్షన్స్ ఫిబ్రవరి 9, 10, 11 తేదీల్లో జనగామలో జరుగనున్నాయి.

రేపు ఉచిత దంత వైద్య శిబిరం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): ఇండియన్ డెంటల్ అసోసియేషన్(ఐడీఏ) డెక్కన్ బ్రాంచ్, ఆలిండ